తాండూరు, నవంబర్ 20: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం తాండూరు పట్టణం శాంతినగర్‌లో తన ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కుటుంబ వివరాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, సూపర్ వైజర్ శారద, ఎన్యూమరేటర్ బి.అంజయ్య ఉన్నారు.

పరిగి, నవంబర్ 20 : ప్రభుత్వం చేపడుతున్న కుటుంబ సమగ్ర సర్వేలో భాగంగా బుధవారం స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సర్వే కోసం వచ్చిన ఎన్యూమరేటర్‌కు తమ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంపై అవగాహన కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

వికారాబాద్, నవంబర్ 20 : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల జిల్లా స్థాయి ముగింపు కార్యక్రమం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి మండల ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 17 గ్రంథాలయాల్లో 3.10లక్షల పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు గ్రంథాలయాలను విద్యార్థులు సందర్శించడం, పుస్తక పఠనం పైన అవగాహన కల్పించి వారు అలవాటు పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి సురేశ్‌బాబు , తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సంబంధిత అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అనంతపద్మనాభస్వామి జాతర

వికారాబాద్, నవంబర్ 20 : కార్తిక మాసం అనంతగిరి పెద్ద జాతర సందర్భంగా మంగళవారం వికారాబాద్ సమీపంలోని అనంతపద్మనాభస్వామి దేవాలయానికి భక్తులు తరలి వచ్చారు. భక్తులు ఆలయ పుష్కరిణి వద్ద స్నానాలు చేసి, అక్కడ ఉన్న ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం మెట్ల దారిగుండా ఆలయం వరకు వచ్చి స్వామి వారి దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభం

కొడంగల్, నవంబర్ 20: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం హస్నాబాద్, ఆధ్వర్యంలో కొడంగల్ సహకార సంఘంలో బుధవారం నూతన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కటకం శివకుమార్, సంఘం కార్యవర్గ సభ్యులు నారాయణ, రాఘవేందర్‌రెడ్డి, బుగ్గప్ప, పకీరప్ప, ఎల్లమ్మ, సాయమ్మ, ఎండీసీసీబీ బ్యాంకు మేనేజర్ ప్రభాకర్ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్ తదతరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

దోమ, నవంబర్ 20 : విద్యార్థులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సురేశ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తరచుగా వచ్చే రక్తహీనత, హిమోగ్లోబిన్ టెస్ట్‌లను నిర్వహించి వారికి మందులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకట్, ఎండీ షఫీ, ఏఎన్ఎం సూరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి నియామకం

దౌల్తాబాద్, నవంబర్ 20: మండలంలోని సంగాయిపల్లి గ్రామానికి ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా నీటూర్ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి రవీందర్‌కు బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో కలెక్టర్ మరియు ఇతర అధికారుల దాడిలో అరెస్ట్ కావడంతో జిల్లా ఉన్నతాధికారులు రాఘవేందర్‌యాదవ్‌ను సస్పెండ్ చేయడంతో సంగాయిపల్లి గ్రామానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరాకు ఇన్‌చార్జి బాధ్యతలు రవీందర్‌కు అప్పగించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

బాలల హక్కులను పరిరక్షిద్దాం

బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న సాధన సంస్థ ప్రతినిధులు

తాండూరు, నవంబర్ 20 : బాలల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత అని సాధన సంస్థ ప్రతినిధులు జ్యోతి, రాములు పేర్కొన్నారు. బుధవారం తాండూరు పట్టణం ఉర్దూమీడియం పాఠశాల, పెద్దేముల్ మండలం కందనెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సాధన సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో చిన్నారులకు ఉన్న హక్కులను చక్కగా సద్వినియోగం చేసుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. 18 సంవత్సరాలలోపు బాలబాలికలను ఎవరూ పనిలో పెట్టుకో కూడదన్నారు. తల్లిదండ్రులు విధిగా పాఠశాలకు పంపాలన్నారు. పిల్లలతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సున్నితంగా ఉండాలన్నారు. చక్కటి భవిష్యత్‌కు మార్గదర్శకంగా ఉంటూ పిల్లల సంపూర్ణ వికాసానికి కృషి చేయాలని కోరారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువు కోవాలని సూచించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ముగిసిన బాలల దినోత్సవ వారోత్సవాలు..

కొడంగల్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

ధారూరు బాలికల పాఠశాలలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు స్వప్నప్రియ

కొడంగల్, నవంబర్ 20: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజులుగా నిర్వహిస్తున్న వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాధానోపాధ్యాయులు మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజులుగా వివిధ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. చివరి రోజు మాదక ద్రవ్యాలు, అసాంఘిక కార్యక్రమాలు తదితర అంశాలపై జరిగే నష్టాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని నివారించే దిశగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆనంద్‌రావు, గోపినాథ్, ఏసురత్నం, కరుణాకర్ పాల్గొన్నారు.

ధారూరు: మండలంలోని వివిధ పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సాధన స్వచ్ఛంద సంస్థ మండల కో-అర్డినేటర్ అంజయ్య అన్నారు.బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.బాల్య వివాహాలు చేసుకోవడం వలన జరిగే నష్టాలు, బాలకార్మికుల గురించి, బాలల అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు స్వప్నప్రియ మాట్లాడుతూ చిన్నతనంలో పెండ్లిలు చేసుకోవడం చట్టరీత్యానేరమన్నారు. పిల్లలు శారీరకంగా మానసికంగా ఎదుగలేక పోతారని, పుట్టే పిల్లలు బలహీనంగా పుడతారన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఎస్‌వో స్రవంతి, పాఠశాల ఉపాధ్యాయు లు, సాధన స్వచ్ఛంద సంస్థ మండల కో-అర్డినేటర్ అంజయ్య, సభ్యులు అనీమా, ప్రకాశం తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

బంట్వారం (కోట్‌పల్లి), నవంబర్20 : రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. తాండూరు మండలం బెన్నూరుకు చెందిన ఇద్దరు యువకులు, సదాశివపేట నుంచి తాండూరుకు వస్తుండగా, కోట్‌పల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వికారాబాద్ వెళ్తున్నారు. అయితే ఈ రెండు బైకులు రాంపూర్ సమీపంలోని కంకణాళపల్లి గేట్ సమీపంలో ఎదురురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నరేందర్, మహేశ్‌లతో పాటు మరో యువకుడు తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా అసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలియ జేశారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటది

కులకచర్ల, నవంబర్ 20 : బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రానికి చెంది కర్రె నర్సింహులు కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సహకారంతో ఆయన అంత్యక్రియలకు రూ. ఐదువేలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కటికె నర్సింహులు, కులకచర్ల మాజీ ఎంపీటీసీ మాలె కృష్ణయ్యగౌడ్, బీఆర్ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి జెట్టిగాళ్ల వెంకటయ్య, మాజీ వార్డు సభ్యులు లక్ష్మి వెంకట్ రాములు, కర్రె రాములు, బీఆర్ఎస్ నాయకులు శివ్వని చుక్కయ్య, కర్రె నర్సింహులు, బి సత్యయ్య, పెద్ద గోపాల్, శివని ఎల్లయ్య, రవికుమార్, వెంకటయ్య, కొమ్ము అంజిచ బాలకృష్ణ, శివని భీమయ్య, నర్సింహులు, సురేశ్, నాగని బిచ్చయ్య పాల్గొన్నారు. కాగా కర్రె నర్సింలు అంత్యక్రియలకు డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి రూ.ఐదువేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో బ్లాక్ బీ అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, గ్రామస్తులు వెంకటేశ్, ఎల్లయ్య, నర్సిం హులు, రామయ్య, వెంకటయ్య, ఆంజనే యులు, శ్రీనివాస్, సురేశ్, శ్రీను, రమేశ్, బాను, మురళి పాల్గొన్నారు.

ఎర్రమట్టి వాహనాలు స్వాధీనం

నవాబుపేట, నవంబర్ 20: మండల పరిధిలోని అర్కతల గ్రామంలో ఎర్ర మట్టిని రాత్రి పూట అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు. ఎవరైనా ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

మండల వ్యవసాయాధికారిగా పరిమళ

కులకచర్ల, నవంబర్ 20 : చౌడాపూర్ మండల వ్యవసాయాధికారిణిగా పరిమళ బాధ్యతలు చేపట్టారు. కులకచర్ల మండల వ్యవసాయాధికారి వీరస్వామి చౌడాపూర్ మండలానికి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించగా చౌడాపూర్ మండలానికి పూర్తి స్థాయి వ్యవసాయాధికారిగా పరిమళను ప్రభుత్వం నియమించింది. దీంతో ఆమె బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను ఏఈవోలు, మండల ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ఘనంగా సన్మానించారు. అలాగే ఇన్ని రోజులు ఏఈవోగా వ్యవహరించిన వీరస్వామిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈవో విశ్వనాథం, డీలర్స్ అసోషియేషన్ నాయకులు వెంకటేశ్, నర్సింహ, శ్రవణ్‌కుమార్, కల్యాణ్, పవన్‌రెడ్డి, విద్యాసాగర్, వెంకటయ్య, నరేశ్, గ్రామ రైతులు గోపాల్, నాగయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి విరాళం



కులకచర్ల, నవంబర్ 20: కులకచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన వడ్డె ఆంజనేయులు బుధవారం కులకచర్ల మండల కేంద్రంలోని అయప్పస్వామి దేవాలయ నిర్మాణానికి రూ. 50,051 విరాళాన్ని బుధవారం గురుస్వాములకు అందజేశారు . కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ పట్లోళ్ల వెంకట్‌రాంరెడ్డి, గురుస్వాములు ఈశ్వరయ్య చంద్రశేఖర్, శివకుమార్‌గౌడ్, స్వాములు వెంకటయ్య, నందు, గ్రామస్తులు అంజి, కృష్ణయ్య పాల్గొన్నారు.

హరితహారం పనులు ప్రారంభం

ఊటుపల్లిలో నర్సరీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో మహేశ్‌బాబు

దోమ, నవంబర్ 20: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కల పెంపకానికి హరితహారం నర్సరీ పనులను ప్రారంభిస్తామని ఎంపీడీవో మహేశ్ బాబు అన్నారు. 2024-25 సంవత్సరానికి గాను మండల పరిధిలోని 36 గ్రామ పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దోమ మండలానికి మూడు లక్షల 96 వేల మొక్కలు పెంచేందుకు ప్రభుత్వం టార్గెట్ ఇచ్చిందన్నారు.అందులో భాగంగా బుధవారం ఊటుపల్లిలో ప్రారంభమైన నర్సరీ పనులను పరిశీలించినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి

ఎరువుల దుకాణంలో రికార్డులు చూస్తున్న డీఏవో

బషీరాబాద్, నవంబర్ 20: యాసంగి సీజన్‌లో సాగు చేసే పంట వివరాలను రైతులు తప్పని సరిగా ఏఈవోల వద్ద నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలో క్యాద్గీరా గ్రామంలో రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల పూర్తి వివరాలను ఈ-పాస్ మిషన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. మందులు, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాలని సూచించారు. అనంతరం కాశీంపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చే ముందు తేమశాతం, శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. వరి కొయ్యాలు కాలిస్తే కలిగే నష్టాల గురించి రైతులకు తెలిపారు. డీఏవో వెంట ఏఈవో నవీన్ ఉన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక ప్రగతి సాధించాలి

పెయింటర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, నవంబర్ 20: స్వయం ఉపాధితో ఆర్థిక ప్రగతి సాధించాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం పరిగిలో పెయింటర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవడంతోపాటు పలువురికి ఉపాధి చూయిస్తూ ఆర్థికంగా ఎదగడం సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ కరణం అరవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, కౌన్సిలర్ కృష్ణ, నాయకుడు తాహెర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ

మర్పల్లి కేజీబీవీ పాఠశాలలో కొనసాగుతున్న కరాటే శిక్షణా తరగతులు

మర్పల్లి, నవంబర్20 : మండల కేంద్రంలో పలు ప్రభుత్వ పాఠశాలలో బాలికల స్వయం రక్షణ కొరకు కరాటే శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రాజెక్టు డైరెక్టర్ సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో ఈ తరగతులను నిర్వహిస్తున్నారిన ఈ సదుపయోగాన్ని బాలికలు ఉపయోగించుకోవాలని సంగయ్య తెలిపారు. శిక్షణ తరగతుల కొరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సందర్శించి, అడ్మిషన్లు తీసుకోవాలన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతలు

మర్పల్లి, నవంబర్ 20 : మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాస్‌ను బుధవారం అధికారులు నియమించారు. మంగళవారం 'వారం రోజులుగా నిలిచిన రిజిస్ట్రేషన్‌లు' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తా కథనంతో అధికారులు స్పందించారు. దీంతో బుధవారం తాత్కాలికంగా ఈ నెల 30 వరకు కోట్‌పల్లి తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు.

నేడు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ధారూరు, నవంబర్ 20: మండల పరిధిలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కులను రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం పంపిణీ చేయనున్నట్లు ధారూరు తహ సీల్దార్ షాజిదా బేగం బుధవారం ఓ ప్రక టనలో తెలిపారు మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం లో మధ్యాహ్నం 1:00 ఈ కార్యక్రం ఉంటుంది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338964-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962